


ఆవాళ మధ్యాహ్నం యేమీ బాగాలేదు. వర్షాకాలంలో మబ్బుపట్టితే ఎట్లా వుంటుంది? వాన కురుస్తుందా అంటే అదీ లేదు. మహా 'డల్'గా వుంది. హఠాత్తుగా సోమూ గనక రాకపోతే ఆవాళ యెట్లా గడిచేదో తెలియదు. కాని ఆవాళ సోమూ కూడా ఎందుకనో ఆదోరకంగా వున్నాడు.

న్యూస్‌పేపరు కాసేపు పేజీలు తిరగ వేసి, సోమూకు ఇస్తూ—'ఇవ్వాళ విశేషాలేమిటో చూశావా?' అన్నాను.

"ఏమిటి?"

"ఈ పత్రికలో 7, 8 'కనపడుటలేదు' 'తప్పిపోయినాడు' అనే ప్రకటనలున్నై."

సోమూ కుతూహలమేమీ చూపించలేదు: ఎట్లా కూర్చున్నవాడు అట్లానే కూర్చున్నాడు, సిగరెట్లు పీలుస్తూ. గాలి లేకపోవటంవల్ల పొగ అంతా గదిలో చుట్టుముట్టింది. నేను ఏదో ఒకటి మాట్లాడాలని మళ్ళీ ఆ ప్రసంగమే తెచ్చాను:

"ఈ 'కనపడటంలేదు' అనే ప్రకటనలు చూస్తే నాకు నవ్వు వస్తుంది. వీటిలో చాలా వాటికి కారణా లెట్లావుంటాయో తెలుసునా? కుర్రవాడు సినిమా చూసి పొద్దుపోయి యింటికి వస్తాడు. ఇది ఆవాళ కొత్తకాదు, రోజూ అట్లా వచ్చేవాడే. తండ్రి ఇంటిదగ్గర భోజనానికి కూర్చున్నప్పుడు భార్యని — 'ఏడీ, నీ పుత్రుడు కనపడడే!' అని అడుగుతాడు.

"తను దాచిన డబ్బులోనించి కుర్రవాడు ఏడ్చి మొత్తుకోగా అమ్మ వాడికి ఒక రూపాయి తీసి యిస్తుంది. అందుకనే ఆమె ఎరిగి అబద్ధమాడలేక మెదలకుండా వూరుకుంటుంది.

"తండ్రి అంటాడు: 'ఇంత పొద్దుపోయినా 'దొర'కు రావటానికి తీరలేదు. క్రిందటిసారి పరీక్ష తప్పి నా దుంప తెంచాడు. ఈ మాటుకూడా పాసుకాడు చూస్తే! డబ్బు ఇక్కడ నాకేమన్నా చెట్లున కాస్తుందనుకున్నాడో ఏమో! ఇక ఇంట్లో అడుగు పెట్టనివ్వను వీణ్ణి, కాలు పెట్టనివ్వను."

"ఈ నోటి గంతులతోనే సరిపోతే

చక్రపాణి

దనుకుంటాను—సమయానికి సుపుత్రుడు గనక రాకపోతే, తండ్రి ఇక ఆ ధోరణి ఆపుకోలేడు. ఒక విధంగా తన గౌరవాన్ని కాపాడుకోవటం కోసమన్నా మాట్లాడవలసి వుంటుంది. ఆ కోపంలో అనవసర శబ్దాలుకూడా కొన్ని వుపయోగించ వచ్చు.

"ఇలాంటి కొడుకుతో నాకేమీ సంబంధం లేదు. వెళ్ళిపో!'' అని కూడా అంటాడు ఆఖరికి.

"అభిమాన ధనుడైన కుమారుడు తండ్రిగారి ఆజ్ఞ ఏది పాలించకపోయినప్పటికీ ఇదిమాత్రం వెంటనే పాలించటానికి సిద్ధమవుతాడు.

"తల్లికి యేటు మాట్లాడటానికీ, ఏమి మాట్లాడటానికి తోచక—'భోజనాల దగ్గర ఎందుకు యివన్నీ! అయినాక మాట్లాడకూడదూ?' అంటుంది.

"తండ్రి యీమాటు భార్యమీద లేస్తాడు: నీ తోమత్తుచూసే వాడిలా పాడైపోయాడు। నువ్వే వాణ్ణి చెడగొట్టింది."

"తల్లి కొంగుతో కళ్ళు తుడుచుకుంటుంది. కొడుకు ఈ విశాల పృథ్విలో గమ్యస్థానం చూసుకోకుండా బయలుదేరాడు.

"అమర్నాడు పెద్ద ఆందోళన. తల్లి ఆ రాత్రినించే పచ్చిగంగ ముట్టుకోదు. ఇవ్వాళకూడా బహుశా రాత్రి నిద్రపట్టివుండదు. కాని ఆ సంగతి బయట ఎట్లాపెడతాడు. భార్యమీద ఎగురుతాడు:—'ఎందుకు వూరికే మూలుగుతావు. ఇలాంటి కొడుకు పోవటమే మంచిది."

తల్లి బిగ్గరగా ఏడుస్తుంది.

ఈమాటు తండ్రి పళ్ళు బిగపట్టి మాట్లాడినా ఆశ పట్టుకు ఏడిపిస్తూ ఉంటుందన్న:— "ఎక్కడికి పోతాడు? సాయంత్రానికల్లా ఇంటికి తిరిగి వస్తాడు। డబ్బులేకుండా హోటల్లో ఎవరేస్తారు వీడికి తిండి?"

తల్లి యీమాటు కన్నీళ్ళు తుడుచుకుంటూ—"ఈ చలిలో రాత్రంతా ఎక్కడున్నాడో. ఎట్లా గడిపాడో అనే నా భయం!" అంటుంది.

"ఊఁ, భయం!" తండ్రి ఈ మాటను వెటకారంగా తోసివెయ్యాలనుకుంటాడు. 'మీ అబ్బాయికి ఏమీ ఫర్వాలేదు: ఏ స్నేహితుడి ఇంట్లోనో హాయిగా వుంటాడు. అక్కడ కొంచెం హాయిగా లేకపోతే వాడే ఇక్కడికి వస్తాడు.'

తల్లికి ఇంకా ఎక్కిళ్ళు వుంటై. "వాడికి ఎంత అభిమానమో ఎరుగుదురుగా!" అంటుంది.

తండ్రికి విసుగుపట్టి వెళ్ళిపోతాడు. సాయంత్రం ఆఫీసునించి ఇంటికి వచ్చి చూస్తే వ్యవహారం శ్రుతి మించివుంటుంది. కుర్రవాడు తిరిగి రాలేదు. తల్లి మంచంమీదనించి లేవనని పట్టుపట్టి వుంటుంది:

సోమూ సిగరెట్టు త్రాగటం పూర్తయింది. ఇంత సేపటినుంచీ చెప్పింది వాడు విన్నట్టు కూడా కనపడలేదు. అసలు కదలను కూడా లేదు.

నేను కొంచెం విసుగుతో — "ఏమిటోయ్ నీ గొడవ! నేను ఇంత సేపటినుంచీ ఊరికనే అరిచి చావటమేనా?" అన్నాను.

ఈమాటకుకూడా సోమూ జవాబేమీ ఇవ్వకుండా చేతిలో సిగరెట్టుపీక అవతల పారవేసి, చాపినకాళ్ళు ముడుచుకుని, తిన్నగా కూర్చుని అన్నాడు: నీకు తెలియదు! ఈ ప్రకటనలవెనక నిజమైన ట్రాజెడీ కూడా ఉంటుంది."

"నేను కాదనను అది. ఎక్కడన్నా ఒకడు తిరిగి రాకపోవటంకూడా కదు."

సోమూ చిఱనవ్వు నవ్వి — "నేను చెప్పేది అదికాదు. తిరిగి వచ్చినవాడి ట్రాజెడీయే నేనొకటి ఎరుగుదును!" అన్నాడు.

నేను ఉత్సుకతో — "అంటే —" అన్నాను.

"విను చెపుతాను!"

ఇంతలో వాన సాగింది బయట. గాజు కిటికీలలోనించి బయటి రోడ్డూ, ఇళ్ళూ మసకగా కనిపిస్తున్నై. యావత్తు ప్రపంచంనించీ మేము వేరయ్యామా? అన్నట్టు వుంది నాకు.

* * *

"నీవు పాతపత్రికల ఫైల్సుగనక తిరగవేసిచూస్తే, చాలా సంవత్సరాల క్రిందట, ఒక ముఖ్యమైన దినపత్రికలో కొంతకాలంవరకు వరసగా ఒక ప్రకటన కనబడుతుంది. అది ప్రకటన కాదు; పూర్తి చరిత్ర! రోజూరోజూ వరసనే చదువుకుంటూ పోతే నిండు కథ ఒకటి తెలుస్తుంది. ఆ అచ్చు అక్షరాల్లోకూడా నిజమైన ఆర్తనాదం, ఒకటి వినిపిస్తుంది. అది, "కనపడుటలేదు" అనే ప్రకటనే. మొదట తల్లి ప్రార్థిస్తుంది, కొడుకును తిరిగిరమ్మని. కుంటుపడిన ప్రార్థన, నిట్టూర్పుల మాదిరిగానే ఆ వార్తా పత్రికలో కలిసిపోతుంది. ఆ తర్వాత తండ్రి గంభీరస్వరం వినిపిస్తుంది. దానిలో కొద్దిగా కంపన ఉన్నప్పటికీ ధీరంగానూ, శాంతంగానూ, వుంది — "శోభన్, తిరిగిరా. నీ తల్లి మంచం ఎక్కింది. నీకు ఈ మాత్రం కర్తవ్యం కూడా తెలియదా?"

ఈ ప్రకటన ఆ తర్వాతకూడా ఆగలేదు. తండ్రిగొంతు భారమైనట్టుగా, అంటే పట్టుకున్నట్టుగా ఉంది:—"శోభన్, ఇప్పుడు రాకపోయావంటే నీ తల్లి నిక చూడలేవు."

కాని శోభనుండి హృదయం ఇంతటితో కరగలేదనుకుంటాను; ఆ ప్రకటన కొద్ది మార్పులతో అట్లానే నడుస్తూవుంది. కాని తండ్రి మాత్రం సంబాళించుకునే స్థితిలో లేడు. అతని స్వరంలో దుఃఖంతో కూడిన వ్యాకులతా,

దౌర్బల్యమూ కనిపిస్తూ ఉన్నై :—
"శోభన్ ? మేము దినాలు ఎలా గడుపుతున్నామో నీకు తెలుసా ! రా నాయనా! ఇంకా మమ్మల్ని ఏడిపించకు."

ఈ ప్రకటన క్రమంగా హతాశకిందికి మారిపోయింది. తర్వాత ఈ పద్ధతే మారింది. ఫలాని ఫలాని ఆకారం, చిహ్నాలుగల కుర్రవాడు ఒక సంవత్సరం నించీ కనపడటంలేదు. అతనిజాడ చెప్పిన వారికి బహుమానం ఇస్తాము.

బహుమానం డబ్బుకూడా క్రమంగా పెంచుకు పోయారు ప్రకటనలో :—
"బక్కపలచని కుర్రవాడు, 15, 16 ఏళ్లుంటై. ఎడమ చెవికింద, మెడమీద పెద్ద పుట్టుమచ్చ ఉంది. ఇతను జీవించివున్నదీ, లేనిదీ చెప్పినాకూడా బహుమానమిస్తాము."


సోమూ కాసేపు మాట్లాడలేదు. వర్షం పడటంవల్ల కిటికీ అద్దాలు మసగ్గా, పొగకమ్మినట్లుగా ఉన్నై. చలికూడా ఎక్కువైంది. కంబళి కప్పుకుంటే బాగుండునా అనిపించింది.

"ఇదంతా ప్రకటన సంగతేనాయె. నీకు అసలు సంగతి ఏమన్నా తెలుసునా!" అన్నాను.

"ఆఁ. శోభనుణ్ణి నే నెరుగుదును. వాడేదో పెద్దకారణం ఉండి అలిగి వెళ్ళిపోలేదు. అలాంటి వాడికి యిల్లువదలడమే సహజం ఏదో వంక దొరికితేచాలు. ప్రపంచంలో కొంతమంది పుట్టినప్పటి నుంచే నిర్లిప్తంగా వుంటారు. వాళ్ళవి కఠిన హృదయాలు కావు. కాని దేన్నీ అంటనివ్వరు తనకు. నీకు ఆశ్చర్యం వేస్తే వెయ్యవచ్చు. మొదటి రోజుల్లో శోభన్ పత్రికవంక చూసేవాడే కాదు. అధవా కంటపడ్డా అప్పుడే మరిచిపోయేవాడు. ఇల్లువదలటంవల్ల కలిగే కష్టాలకు యింకొకడైతే యెప్పుడో భయపడేవాడు. శోభనుడు భయపడడం లేకపోగా తృప్తి పడ్డాడు. ఇలా వుండగా ఆఖరికి ఒక ప్రకటన పడింది. శోభనుండి ఆనవాలు, గుర్తులే కాకుండా అందులో ఈ వాక్యం కూడావుంది. "శోభన్ ! నీవిక నీతల్లిని చూడలే వనుకుంటాను. ఆమె నీ పేరే జపిస్తున్నది !" — అంతే. ఆ తర్వాత యిక ప్రకటనే లేదు.

"దాదాపు రెండు సంవత్సరాలు గడిచినై. శోభనుడు హఠాత్తుగా వాళ్ళవూరు పోయాడు. ఒక్క విషయం చెప్పితే శోభనుడు ప్రకృతి కొంతవరకు తెలుస్తుంది. అది యింతవరకు చెప్పలేదు. శోభనుడు మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు కాడు జమీందారుల అబ్బాయి. అనేక తుపాన్లు వచ్చినాకూడా వాళ్ళఆస్తి యేమీ చెక్కుచెదర లేదు. ఆ ఆస్తికి యేకైక వారసుడు వాడే."

సోమూ అనగానే నేను — "ఇకచాలు. మిగతాది చెప్పకపోయినా నేను గ్రహించాను" అన్నాను.



'ఆయన్ని రోజూ 24 గంటలూ వంట చేయించి రాసి రంపాన పెడ్తాననుకుంటున్నారేమిటి. శనివారం, ఆదివారం సాయంకాలం మార్పుకోసం బట్టలూ అవీ ఉతికిస్తుంటానుకూడాను.''

---

సోమూ మందహాసంచేసి నాకు జవాబు చెప్పకుండానే చెప్పుకుపోవడం ప్రారంభించాడు:-

"రెండు సంవత్సరాలపాటు అతను పడ్డ కష్టాలూ, అవస్థలూ, అతన్ని చలింపజెయ్యకపోయినా వాడి ముఖంమీద వాటి ముద్ర వుండనేవుంది. ఈ రెండేళ్ళలో వాడు చాలా మారాడు. కాని అంత మాత్రంచేత వాళ్ళ నౌకర్లు తన్ను గుర్తించకపోతారని అతను కలలోకూడా అనుకోలేదు.

శోభనుడు వాళ్ళ వూరు పోయి సరాసరి యింటికి వెళ్ళాడు. మొట్టమొదట అతన్ని యింటోకి పోనివ్వకుండా ఆటంకపెట్టింది మేనేజరుగారు.- "ఎవరికోసం ?" అన్నాడు అతను.

"ఎవరికోసమూ కాదు. ఇంటోకి పోవాలి!" అన్నాడు శోభనుడు నవ్వుతూ.

మేనేజరు అతనివంక కాసేపు చిత్రంగా చూసి, నవ్వుతెచ్చుకుని "ఓ ఆలాగా ? ఐతే అంత తొందర యెందుకూ? కాసేపు బయటహాల్లో కూర్చోండి'' అన్నాడు.

శోభనుడికి ఆశ్చర్యం వేసి- "ఏమిటి? ఏమిటి వ్యవహారం మేనేజరుగారూ ?" అన్నాడు.

''ఏమీలేదు ! ఏమీలేదు !''

"అమ్మ బాగుందా ?" శోభనుడి ప్రశ్నలో నిజమైన వ్యాకులత కనిపిస్తూ వుంది.

మేనేజరు నవ్వుతూ "ఎందుకు బాగుండదూ, రండి నా వెంట !" అన్నాడు.

"లోపలికే వెళ్ళవచ్చుగా!" అన్నాడు శోభన్.

మేనేజరు కొంచెం కఠినంగా "ఉహు, వల్లకాదు. మీరు నా వెంట రండి." అన్నాడు.

శోభనుడు దిక్కుతోచనివాడివలె మేనేజరు వెంట బయటహాల్లోకి పోయి కూర్చున్నాడు. ఈ రెండు సంవత్సరాల్లో అక్కడ కొద్ది మార్పులు వచ్చినై. వెనకటి గుమస్తా లేడు. కొత్తవాళ్ళు యిద్దరు అక్కడ కూర్చుని ఖాతాలు రాస్తున్నారు. షరాబుమాత్రం వెనకటి వృద్ధుడేవుండడం చూచి కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు.

మేనేజరు శోభన్ను చూ ర్పోమని షరాబుతో — "ఈయన లోపలికి పోవాలని అంటున్నాడు" అన్నాడు.

మేనేజరుగొంతు శోభన్‌కు అస్వాభావికంగా వినిపించింది. షరాబు ముక్కుమీద కళ్ళజోడు కొంచెం పైకిమీ స్తి — "ఓ మీరు ఈ వేళే దయచేసినట్టు వున్నారు!" అన్నాడు.

"ఆఁ, ఇప్పుడే!"

శోభనుడు అధీరుడై — "మీ దేహంతో ఆ చెప్పదలచుకుంది స్పష్టంగా చెప్పండి! అమ్మకేదైనా ఆపద వచ్చిందా? నాన్నగారెట్లా వున్నారు? అన్నాడు.

చుట్టూ వున్నవాళ్ళు ఆశ్చర్యంతో చూస్తూ వుండిపోయారు. కాసేపు ఎవ్వరూ మాట్లాడలేదు. ఆ తర్వాత మేనేజరు — "అంతా బాగానే వున్నారుకాని ఇప్పుడు వాళ్ళని చూడటం కుదరదు" అన్నాడు.

ఈమాటు శోభనుడికి కోపం వచ్చింది. "ఎందుకు చూడటానికి పడదు? మీ కేమన్నా మతిపోయిందా యేమిటి? నేను పోతున్నాను!"

శోభనుడు లేచాడు. కాని మేనేజరు అతనికంటే ముందుగా వాకిలి దగ్గరికి పోయి చాలా శాంతంగా — "చూడండీ! వృధాగా అల్లరిచేసి లాభంలేదు! ఫలితమేమీ వుండదు" అన్నాడు.

శోభనుడికి హఠాత్తుగా అసలు విషయం తట్టింది. అతను ఆశ్చర్యంతో కూడిన భయంతో — "మీరు నన్ను గుర్తించలేదా?" అన్నాడు.

ఎవ్వరూ మాట్లాడ లేదు.


"నేను శోభనుణ్ణి! మీకు తెలియటం లేదా, నేను శోభనుణ్ణి!"

ఈమాటు మేనేజరుగారు మాట్లాడారు.

"మీరు కొంచెం సేపు వుండండి... నేను వస్తున్నాను" అని ఒక గదిలోకి పోయి ఒక ఫోటో తెచ్చి శోభన్‌కు యిచ్చాడు. అది అతని చిన్ననాటి ఫోటో. ఇప్పుడంత స్పష్టంగా కూడా లేదు.

"ఇతన్ని యెరుగుదురా?" అన్నాడు మేనేజరు

శోభనుడు ఆశ్చర్యంతో — "ఇది నా ఫోటోయే. మీరు చూడండీ బాగా, నన్ను కూడా కలిపి! ఛా, మీ ప్రవర్తన చాలా



"హోంవర్క్ చేస్తున్నారు. ఇప్పుడు షికారుకి రారు?'
'వీడ్ని చూసి 20 ఏళ్ళయిందండి. చిన్నప్పుడుకూడా అంతే. లెక్కల హోంవర్కు అవీ చేస్తేనేకానీ వీధిలోకి వచ్చేవాడు కాదు.'

---

అసహ్యంగా ఉంది!" అని జుట్టు పీక్కుంటూ కుర్చీలో కూలబడ్డాడు.

మేనేజరు అతని ప్రక్కనే కూర్చుని అన్నాడు — చూడండీ, మీరేమీ అనుకోకండి. మీకూ దీనికీ కొంచెం పోలిక వున్నమాట నిజమే. ఇంతకు ముందు కూడా యిద్దరిముగ్గురితో అలానే కలిసింది, పుట్టుమచ్చతో కూడా. ఈ విషయంలో యిక మేమేమీ పట్టించుకోకూడదని ఆజ్ఞవుంది. అందుకని మేమేమీ చెయ్యదలుచుకోలేదు. మీ రిక వెళ్ళవచ్చు."

శోభనుడు మతిపోయిన వాడిలాగా అందరివంకా చూశాడు. ఎవరి చూపులోనూ తన మాటలమీద విశ్వాసమున్నట్లు కనిపించలేదు.

"ఒక్కమాటు మా అమ్మనీ నాన్ననీ చూస్తాను. అంతకంటే నాకేమీ అక్కర్లేదు. మీరు నామాట యెట్లానూ నమ్మటం లేదు. ఆ సహాయం మాత్రం చెయ్యండి" అన్నాడు శోభనుడు విచారంతో ప్రార్థించినట్టుగా.

మేనేజరు నిరాశ చెందినట్టుగా చేతులతో వ్యక్తంచేసి — "ఐతే నిజంచెప్తాను వినండి. వారంరోజులక్రింద శోభన్ చచ్చిపోయాడు. ఆ వార్త మాకు తెలిసింది!" అన్నాడు.

ఈ స్థితిలో కూడా శోభనుడు నవ్వకుండా వుండలేకపోయాడు. నవ్వి — "ఎలా చచ్చిపోయాడు?" అని అడిగాడు.

శోభనుడి గొంతులోవున్న వెక్కిరింపు లక్ష్యపెట్టకుండా మేనేజరు — "కారుక్రింద పడి చచ్చిపోయాడు. అతని

వూరూ పేరూ తెలియటానికి వీలులేక పోయింది. కాని, ఆ దుర్ఘటన జరిగి నప్పుడు అక్కడవున్న వాళ్ళు చాలా మంది, అతను శోభనుడే నని గుర్తించాడు. పత్రికలలో యిచ్చిన పోలికలతో సరిగ్గా కలిసివున్నై, అతని పోలికలు. ఆస్పత్రికి పోయి కనుక్కున్నాము. డాక్టరుకూడా అలాగే చెప్పాడు...!'' అన్నాడు.

శోభనుడు ఆ తర్వాత యేమిచేసే వాడో చెప్పలేము. కాని, ఆ సమయానికి అతనితండ్రి అటు వస్తున్నాడు. గాలి వానతో దెబ్బతిన్న చెట్టును మనిషితో పోల్చటం ఎంతవరకు సమంజసమో ఇదివరకు తెలిసిందికాదు. కాని యీ వ్యక్తిని చూసినాక అతనికి ఇది చాలా మంచి ఉపమ అని తోచింది. అతని నడకలోకూడా ఏదో భయంకర దుర్ఘటన జరిగినట్టు కనిపిస్తూ వుంది.

ఎవ్వరూ అటు చూడకముందే శోభనుడు అటు పరుగెత్తుకు పోయాడు. విషయం తెలుసుకుని నౌకర్లూ గుమాస్తాలూ అతనికి అడ్డంరాకముందే శోభన్ తండ్రిదగ్గరికిపోయి — ''నాన్నా !'' అన్నాడు.

వృద్ధుడు టక్కున ఆగాడు. అతని బాధా, నిరాశా చూసేవరకు శోభనుడి హృదయంలో కత్తితో పొడిచినట్టయింది.

''నాన్నా ! నన్ను గుర్తించలేవూ ?''

వృద్ధుడు తొట్రుపడుతున్న కాళ్ళతో ఒక్క అడుగు ముందుకు వేశాడు. ప్రబలమైన భావావేశం ముసలివాడి ముఖాన్ని వికృతం చేసింది.

అప్పటికి మేనేజరూ గుమాస్తాలు అంతా వచ్చేశారు.

వృద్ధుడు వణకుతున్న చేతులుపైకెత్తి, కంపితస్వరంతో ''ఎవరూ?'' అన్నాడు.


మేనేజరు శోభనుడి భుజంమీద గట్టిగా చెయ్యివేసి — ''ఎవ్వరూ లేదు. ఆ వెనకటి మాదిరిగానే — ఈ మాదిరిగా మూడుసార్లు మోసపోయాము'' అన్నాడు.

''మేము రానివ్వలేదు. హఠాత్తుగా తప్పించుకువచ్చాడు !'' అన్నాడు ఒక గుమస్తా.

వృద్ధుడు అతన్ని ఆగమన్నట్టు సౌజ్ఞ చేసి — ''ఇకేమి అక్కర్లేదు, అతన్ని పంపించండి'' అని, చివరిసారి శోభనుడి వంక వ్యాకులపాటుతో చూసి లోపలికి వెళ్ళిపోయాడు.

శోభనుడు స్తబ్ధుడై నుంచుని వుండిపోయాడు. మేనేజరు తనకి యేమిచెప్పుతున్నాడోకూడా అతను కాసేపు వినిపించుకోలేకపోయాడు. తను బయటిగది లోకి వచ్చి యెప్పుడు కూర్చున్నదికూడా అతనికి గుర్తులేదు.

కాసేపటికి అతని మందమతిత్వం వదిలింది. లోపలినించి ఒక గుమాస్తా వచ్చి మేనేజరుగారికి యేమేమో చెప్పుతున్నాడు. మేనేజరు అతనికి ఏమి చెప్పుతున్నాడో కాసేపు వినిపించలేదు. తర్వాత




కాస్తైకాస్తై తెలియటం మొదలు పెట్టింది- మేనేజరు చేతిలో చాలా నోట్లు వున్నై. అతని గొంతు బ్రతిమాలుతున్నట్టుగా వుంది.

శోభనుడు ఒక సహాయం చేయాలట. ఇంటి ఆవిడ చావటానికి సిద్ధంగా వున్నదట; ఆమె కింకా కొడుకు చచ్చిన వార్త తెలియదట. ఎవ్వరూ చెప్పలేదట. ఇంకా కొడుకును చూస్తాననే నమ్మకంతోనే ఆమె వున్నదట — అందుకనే, ఆమె నిశ్చింతగా చావలేకుండా వుందట. శోభనుడు, పారిపోయిన ఆమె బిడ్డకు బదులుగా ఆమెకు కనిపించాలట. ఆమె వున్న స్థితిలో యెంతమాత్రమూ గుర్తించలేదట. తప్పిపోయిన కుర్రవాడి పోలికలు ఇతనిలో చాలా వున్నవట. చావటానికి సిద్ధంగావున్న ఆమెకి ఈమాత్రం ఓదార్పు కలిగించవలసిందని, జమీందారు మరీ మరీ చెప్పమన్నాడట. అతని కిందులో ఏమీ నష్టంలేదట...

మేనేజరుగారు నోట్లకట్ట శోభనుడి చేతులో పెట్టాడు.

* * *

సోమూ ఆగాడు. కాసేపు బయట వానచప్పుడు తప్ప మరే శబ్దమూ వినిపించలేదు.

"సోమూ! నీ చెవికింద ఒక పుట్టుమచ్చవుందే?" అన్నాను నేను చివరికి.

సోమూ నవ్వి—"అందుకనే ఈ కథ కల్పించడం అంత సులువైంది!" అన్నాడు.

కాని, యెందుకనో చెప్పలేను, ఆ వాతావరణంలో అతని నవ్వునూ, మాటనూ నేను నమ్మలేక పోయాను.